పేదలకు కార్పొరేట్ వైద్యం

- ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక 10 వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనస్‌బాషా జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ జి. సందీప్‌కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్ పాల్గొని వార్డులోని ప్రజలకు వైద్యసేవలు అందించారు. బీపీ,షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 50 ఏళ్ల వయస్సు వచ్చిందంటే తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కలిగిన ప్రతి తెల్లరేషన్‌కార్డుదారుడికి రూ.25 లక్షలు విలువ చేసే కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నజీర్ అలీఖాన్, సోహయిల్, సమీర్, షబ్బీర్, మన్సూర్, ఖలీద్, ఫరాజ్, ఇంతియాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


బుధవారపేటలో సంక్రాంతి ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అభివృద్ధి పనుల పరిశీలన

నగరంలోని 45 వ వార్డు పరిధిలోని అజీముద్దీన్ నగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ, రోడ్లు, పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున్న జరుగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రతి సచివాలయం పరిధిలో ఇప్పటి వరకు రూ.82.33 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో 46 వ వార్డు కార్పొరేటర్ శ్రీనివాసరావు, 45 వార్డు వైఎస్ఆర్‌సీపీ నాయకులు ప్రభుదాసు, ఫైరోజ్, సయ్యద్, షేక్, సాధిక్, జమ్మన్న ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో ముగ్గుల పోటీలు

నగరంలోని స్థానిక బుధవారపేట 14వ వార్డులో వార్డు నాయకులు రెడ్డి మంజులతా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అతిథిగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ హాజరై మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నంగా సంక్రాంతి పండుగ నిలుస్తుందన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి జానకి (రూ. 5 వేలు), రెండో బహుమతి విజయ (రూ.3 వేలు), మూడో బహుమతి పద్మ (రూ.2 వేలు), నాలుగు బహుమతి రుక్మిణి (రూ.1000) గెలుచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు సునీత, రామేశ్వరి, అబ్దుల్లా, షౌకత్‌అలీ, ఖాసీమ్, మహేష్, అంజి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

కర్నూలు సిటీ: ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అన్సారీ (మహారాష్ట్ర) తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు కర్నూలులోని బీఏఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న పాల్గొన్నారు. రెండో రోజు జరిగిన సమావేశాల్లో జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గంలో ప్రెసిడెంట్‌గా ఇంద్రశేఖర్ మిశ్రా (బిహార్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ (ఆంధ్రప్రదేశ్), జనరల్ సెక్రటరీగా సదానంద గౌడ్ (తెలంగాణ), వర్కింగ్ జనరల్ సెక్రటరీగా అన్సారీ (మహారాష్ట్ర), కోశాధికారిగా జోసెఫ్ సుధీర్ బాబు (ఆంధ్రప్రదేశ్), ఉపాధ్యక్షులుగా టి.సుబ్రహ్మణ్యం (తమిళనాడు), శుభోద్ దత్తు (పశ్చిమబెంగాల్), గంగారాం (రాజస్థాన్), వీరేంద్ర చౌహాన్ (హిమాచల్ ప్రదేశ్), సురేంద్ర కుమార్ (పంజాబ్), కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్ (యూపీ), అష్రఫ్ షేక్ (జమ్మూ కాశ్మీర్), మనో శర్వాజ్ (హర్యానా) ఎన్నికయ్యారు. వీరు మూడేళ్ల పాటు ఆ పదవుల్లో కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

క్లుప్తంగా

కుడా చైర్మన్‌ను కలిసిన కోడుమూరు సమన్వయకర్త


కుడా చైర్మన్ కోట్ల హర్ష, సమన్వయకర్త సతీష్‌ను పూలమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ ఆదిమూలపు సతీష్ శనివారం నగరంలోని వెంకటరమణ కాలనీలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.కుడా చైర్మన్‌ను పూలమాలతో సత్కరించారు. అనంతరం ఇరువురు నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించా రు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకునేందుకు రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కేవీపీఎస్, ఐద్వా నాయకులు

కర్నూలు(సెంట్రల్): దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన పసిపాపపై అత్యాచారం చేసిన అదే గ్రామానికి చెందిన మునిరంగడుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శులు అలివేలు, ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో కామాంధుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేయకపోతే ఎస్పీ ఆఫీసును ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీ కృష్ణ, డి.విజయమ్మ, షబానా పాల్గొన్నారు.

కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితమ్మ

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరితమ్మ ఆవిష్కరించినట్లు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. కురువ కులస్తులు ఆర్థికంగా ఎదగాలని, రాజకీయంగా ముందుంటు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, సంఘం నాయకులు దేవేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శనివారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో 33వ రోజు కర్నూలు అర్బన్ 4వ సెక్టార్ నుంచి వచ్చిన అంగన్‌వాడీలు విజయలక్ష్మి, సుమలత, శ్రవంతి, నాగమణి, లక్ష్మీదేవి, కనకమ్మ, సువర్ణకుమారి, హైమావతి, సుజాతభాయ్ తదితరులు 24 గంటల నిరాహార దీక్షలకు కూర్చున్నారు. ఈ దీక్షలను సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మలతో కలసి గౌస్‌దేశాయ్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..తక్షణమే అంగన్‌వాడీలు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ సమావేశంలో రచ్చ

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం సమావేశం రచ్చకు దారితీసింది. నగరంలోని స్థానిక మౌర్యఇన్‌లో ఆ పార్టీ ఎమ్మెల్సీ షరీఫ్ అధ్యక్షతన శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఫొటోలు తీసుకునే సమయంలో బుధవారపేటకు చెందిన టీడీపీ కార్పొరేటర్ భర్త అబ్బాస్ అదే పార్టీకి చెందిన మహబూబ్‌ఖాన్ మధ్య గొడవ తలెత్తింది. ఒకరినొకరు వాగ్వాదపడుతూ సవాల్ విసురుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అబ్బాస్ అనుచరులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో మహబూబ్‌ఖాన్ ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించి తనకు అబ్బాస్ నుంచి ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేశారు. కాగా ఇరువురి మధ్య ఇప్పటికే పాతకక్షలు ఉండటంతో కేసులు సైతం నమోదై ఉన్నాయి.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- వార్డు బాయ్‌లకు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని వివిధ విభాగాల ఏఎన్‌ఎంలు, ఎఫ్ఎన్‌వోలలో కొందరి పనితీరు సరిగ్గా లేదని, వారి పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఏఎన్ఎంలు, ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో ఎలా పడితే అలా సెలవులు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ డ్యూటీ వేసిన వారు అక్కడే పనిచేయాలని ఆదేశించారు. ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌వోలపై ఆసుపత్రి ఆర్ఎంఓను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి


చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక శ్రీరామనగర్‌లోని యూపీహెచ్‌సీలోని 60వ సచివాలయం పరిధిలోని లక్ష్మీనగర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, వ్యాక్సిన్లు, నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేసిన వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఏఎన్ఎంలు తమ పరిధిలో అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్లు ఇవ్వాలని, ముఖ్యంగా రోటా, ఎంఆర్ వన్, ఎంఆర్ 2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి వారితో చర్చించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. ఆ వివరాలను ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయనిర్మల, ఆశ కార్యకర్త శాంతకుమారి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలుకు కాంస్యం


మూడోస్థానంలో నిలిచిన జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 12న రాజంపేటలో నిర్వహించే 45 వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ జట్టును శనివారం రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి రామాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

జల్ల బాబు మృతి పద్యనాటకానికి తీరని లోటు

కర్నూలు కల్చరల్: పౌరాణిక నాటక రంగంలో జల్ల బాబు మరణం తీరని లోటు అని పలువురు కళాకారులు పేర్కొన్నారు. శనివారం సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జల్ల బాబు సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ శ్రీకృష్ణ, అర్జున, భవాని వంటి పాత్రలను పోషించి మెప్పించారన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆయన నెలకొల్పిన పద్యనాటక సమాజం ఆయన మరణంతో నష్టపోయిందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, జల్లబాబు కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం విశ్వకళా వాహిణి అధ్యక్షుడు మనోహర్ బాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం, చింతామణి, భవాని, అల్లూరి సీతారామరాజు నాటకాల్లోని సన్నివేశాలను కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారులు మహమ్మద్ మియా, దస్తగిరి, ఏసు, రాజశేఖర్, పాండురంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజలు ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) అధ్యక్షురాలు విజయ మనోహరి అన్నారు. శనివారం మండలం కేంద్రం సి.బెళగల్లోని బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నూతన జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార సంఘాల ద్వారా 14 జన ఔషధ కేంద్రాలను ప్రారంభించినట్లు డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తేనే మద్దతు

- వీరశైవ రాజకీయ వేదిక నేతలు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖరప్ప

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఆరు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న వీర శైవ లింగాయతీ, జంగమ మహేశ్వరులకు రానున్న ఎన్నికల్లో రాజకీయ అవకాశాలు కల్పించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని వీరశైవ రాజకీయ వేదిక నేతలు అన్నారు. శనివారం స్థానిక ఏ క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్ సెంటర్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వేదిక కన్వీనర్ జేపీ మల్లికార్జునయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీ మల్లికార్జునప్ప, చంద్రశేఖరప్ప మాట్లాడారు. గతంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన చరిత్ర వీరశైవ లింగాయతీలదన్నారు. జిల్లాలోని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో వీరశైవ లింగాయతీ ఓట్లు అధికంగా ఉన్నాయన్నారు. అలాగే నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ పదవుల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తమకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించే విషయంలో కూడా ఆయా రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. అలాగే శ్రీశైల మహాక్షేత్రంతో పాటు అన్ని శివాలయాల్లో వీరశైవులు, జంగమ మహేశ్వరులకు ప్రాధాన్యత పెంచాలన్నారు. సమావేశంలో నాయకులు జంగమ కోటేశ్వరయ్య, పతంజలి శివరాజు, బద్రీస్వామి, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

భారత న్యాయ సహిత-2024 చట్టం రద్దుకు ఉద్యమిద్దాం

కర్నూలు(సెంట్రల్): భారత న్యాయ సహిత-2024 చట్టం రద్దుకు ఉద్యమిద్దామని రవాణా రంగ కార్మికుల స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.దివాకర్ కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రం తెచ్చే ఈ నూతన చట్టం వల్ల ప్రమాదం చేసిన డ్రైవర్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా పడుతుందన్నారు. శనివారం కార్మిక,కర్షక భవన్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.దివాకర్‌తో పాటు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబులు హాజరై మాట్లాడారు. గతంలో ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం డ్రైవర్ ప్రమాదం చేస్తే 304 సెక్షన్ కింద రెండు సంవత్సరాలు జైలు, రూ.1500 జరిమాన విధించే వాళ్లన్నారు. అయితే ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టం చేసిందన్నారు. ఇది డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి


మహిళలకు చీర సారె అందజేస్తున్న పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్

కర్నూలు (టౌన్): కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వ వికసిత భారత సంకల్ప యాత్ర పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పథకాల అమలును పరిశీలించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌తో కలిసి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు చీరె, సారె అందించారు. కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు మన్సూర్, ఆలీ పాల్గొన్నారు.

అర్హులైన ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న అర్హులైన నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింపజేయాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామరాజు డిమాండ్ చేశారు. శనివారం టీఎస్ఎఫ్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 105 మంది ఉద్యోగులకు టైంస్కేల్ ఇచ్చారన్నారు. వారితో పాటు మరి కొంత మంది ఉద్యోగులు ఐదు సంవత్సరాల సర్వీసు దాటి పది సంవత్సరాలు అవుతున్నా టైస్కేల్ వర్తింప జేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు ప్రకాష్, నరేష్‌నాయక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి అండగా ఉంటాం


ఆంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల ఓబులేసు

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉంటామని ఏపీఎస్ఆర్‌టీసీ కడప జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల ఓబులేసు హామీ ఇచ్చారు. కల్లూరు మండలం ఉలిందకొండ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఆంజనేయులు మృతి చెందగా, 15 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స చేయించారు. మృతి చెందిన ఆంజనేయులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. శనివారం ఆయన మృతదేహాన్ని జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల ఓబులేసు సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను స్థానిక ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాద సంఘటనా స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట కర్నూలు డిపో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సాహిత్య రచనలపై యువత దృష్టి సారించాలి

- సంక్రాంతి కవి సమ్మేళనంలో సాహితీ వేత్తలు


ఏపీ ప్రభుత్వ తెలుగు భాష సేవ పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: యువత సాహిత్య రచనలపై దృష్టి సారించాలని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు సారస్వత వైభవం సంస్థ ఆధ్వర్యంలో శనివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ తెలుగు భాష సేవ పురస్కార గ్రహీతలు ఆకాశ వాణి విశ్రాంత వ్యాఖ్యాత డాక్టర్ వి.పోతన్న, ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మండిఅన్వర్ హుసేన్, విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్పలను సన్మానించారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు మాట్లాడుతూ సాహిత్య సదస్సుల్లో ఐదు పదుల వయసు దాటిన వారు మాత్రమే కనబడుతున్నారన్నారు. యువతీ యుకులు హాజరు కాకపోవడం బాధాకరమన్నారు. సాహిత్యం, భాషపై అభిమానం పెంపొందించాలంటే విద్యాసంస్థల్లో సాహిత్య సమావేశాలు నిర్వహించాలన్నారు. తెలుగు సారస్వత వైభవం సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ కవులు, రచయితలు సాంస్కృతిక రంగంలోనే కాకుండా సాంఘిక, సామాజిక సంస్కరణాత్మక రంగంలో కూడా తమ కవిత్వంతో విశేష ప్రభావాన్ని చూపారన్నారు. కవి సమ్మేళనంలో సాహితీ వేత్తలు ఇనాయతుల్లా, డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, ఎలమర్తి రమణయ్య, కల్యాణ దుర్గం స్వర్ణలత, మాసుంబీ, చంద్రమౌళిని, స్వరూప్‌సిన్హా, బిల్లోన కృష్ణమూర్తి, రత్న లక్ష్మి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరుగున పడిన కళలకు ప్రోత్సాహం


సంగీత గురువులతో కళారత్న భారతి

కర్నూలు కల్చరల్: తెలుగు రాష్ట్రాల్లో మరుగున పడిన కళలను ప్రోత్సాహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర సంగీతం నాటక అకాడమీ సభ్యులు, కూచిపూడి నాట్య గురువు కళారత్న భారతి పేర్కొన్నారు. కర్నూలు పర్యటనకు వచ్చిన ఆమె శనివారం టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గురు శిష్య పరంపర కార్యక్రమంలో భాగంగా పద్యనాటకం, తోలు బొమ్మలాట, హరికృథ ,వంటి రూపకాలను ప్రోత్సహించేందుకు కేంద్రాలను ఎంపిక చేశారన్నారు. పద్య నాటక శిక్షణకు ఎంపికైన కళాక్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. కర్నూలుతో పాటు రాజమహేంద్రవరం, కాకినాడ, కుప్పం పట్టణాల్లో ఒక సంవత్సరం పాటు కళారూపాలపై శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. శిక్షణలో 11 నుంచి 25 సంవత్సరాల లోపు యువతీ యువకులు ఉంటారన్నారు. శిక్షణ కాలంలో గురువులకు నెలకు రూ. 8 వేలు, సహాయ గురువుకు రూ.5 వేలు, ప్రతి విద్యార్థికి రూ.2 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పద్య నాటక కళా రూపాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గురువు వెంకటేశ్వర్లు, సహాయ గురువు పాండురగయ్య, కళాక్షేత్రం సభ్యులు బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

'పచ్చి రొట్ట'పై రైతులకు అవగాహన కల్పించండి

- దేశీ శిక్షణా కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాధురి

కర్నూలు(అగ్రికల్చర్):వ్యవసాయంలో పచ్చి రొట్ట ఎరువులకు విశేషమైన ప్రాధాన్యత ఉందని, వీటి గురించి రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానంగా వరిలో నాట్లకు ముందు పచ్చి రొట్ట ఎరువులు ఎక్కువగా వినియోగిస్తారని తెలిపారు. పిల్లి పెసర, జీలుగను పచ్చి రొట్ట ఎరువులుగా వినియోగించవచ్చని తెలిపారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వకర్త జయచంద్ర మాట్లాడుతూ... ఇన్‌పుట్ డీలర్లు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటారని, రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి అన్ని విధాల సహకరించాలని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయంలో శాస్త్రీయ పరిజ్ఞానం పొంది రైతులకు ఉపయోగపడాలనే లక్ష్యంతోనే ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమ కోర్సుపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

లౌకిక కవనం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో లౌకిక కవనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. శనివారం టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన సాహితీ స్రవంతి విస్తృత స్థాయి సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మతోన్మాదం పెరిగి సమాజంపై విషాన్ని నింపుతోందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల వల్ల లౌకికత్వం ప్రమాదంలో పడిందన్నారు. దేశంలో నిరంకుశ ధోరణులను నిరసిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని లౌకిక విలువలను ప్రతిఫలించే, ప్రబోధించే కవితా స్వరాలకు గాయకులతో లౌకిక కవనం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా నాయకులు అవుల చక్రపాణి యాదవ్, అయ్యన్న, విజయులు, రాము పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
90108 25556
Office mail : sakshiknladvt@gmail.com